సంక్షేమ సారథిని మళ్లీ గెలిపిద్దాం



శివపురంలో వీరాంజనేయులు, ఆలూరు సాంబశివారెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు



పెరవలిలో పర్యటిస్తున్న వీరాంజనేయులు, పైలా నర్సింహయ్య

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు

శింగనమల: రాష్ట్రంలోని పేదలందరికీ సంక్షేమ పథకాలందిస్తున్న సంక్షేమసారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ గెలిపిద్దామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు పిలుపునిచ్చారు. ఆదివారం శివపురం, సీ.బండమీదపల్లి, చక్రాయిపేట, పోతురాజుకాల్వ, పెరవలి, జూలాకాల్వ, జలాలపురం, అలంకరాయునిపేట, కొరివిపల్లి, చీలేపల్లి, సలకంచెరువు, ఈస్ట్ నరసాపురం, సోదనపల్లి, మట్లగొంది, చిన్నమట్లగొంది, శింగనమలలో పర్యటించారు. ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య హాజరయ్యారు. ఈసందర్భంగా వీరాంజినేయులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అర్హత కలిగిన పేదలందరికీ సంక్షేమ పథకాలను కులమత, పార్టీ వివక్ష లేకుండా అందించారన్నారు. ఆయన పెట్టిన సంక్షేమ పథకాలు వల్ల పేదలందరూ ఆర్థికాభివృద్ధి సాధించారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా జగనన్నను చేసుకుందామన్నారు. ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ టీడీపీ నాయకులు అబద్ధపు హామీలతో వస్తారని నమ్మవద్దన్నారు. గతంలో 600 హామీలు ఇచ్చి ఏఒక్కటీ నేరవేర్చలేదని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని చూసి, ప్రజలు జగనన్న పక్షాన నిలబడుతున్నారన్నారు. ఇప్పటికే రెండు చోట్ల నిర్వహించిన సిద్ధం కార్యక్రమానికి భారీ ఎత్తున వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివచ్చాయన్నారు. ఆ సభలకు వచ్చిన జనాన్ని చూసి, టీడీపీ, జనసేనలో వణుకు పుట్టిందన్నారు. అనంతపురంలో జరగబోయే సిద్ధం కార్యక్రమానికి భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, ఎంపీపీ యోగేశ్వరి, నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రమీల, వైఎస్సార్‌సీపీ నాయకులు కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బీకేఎస్ జడ్పీటీసీ భాస్కర్, నాయకులు నాగన్న, తిరుపతయ్య, శ్రీనివాసులురెడ్డి, శ్రీకాంత్, సర్పంచ్ ఆదినారాయణ, బొమ్మన గోపాలురెడ్డి, నాగమునెమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, విజయ, కోరే రాముడు, ఎంపీటీసీ చిన్నబయ్యన్న, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షులు ఎన్‌వి నారాయణ, చెన్నకేశవులు, వీరనారాయణ, నారాయణస్వామి, మాజీ ఎంపీపీ లక్ష్మీనారాయణ, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహం ఊరేగింపు



ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న మాలధారులు

గుత్తి: ఈ నెల 22న లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం సందర్భంగా పట్టణంలో ఆదివారం స్వామి ఉత్సవ విగ్రహాన్ని మాలధారులు ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా కల్యాణోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రాలను పంపిణీ చేశారు. కోటలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి అమృత్ సినిమా థియేటర్, గాంధీ సర్కిల్, రాయల్ సర్కిల్ మీదగా ఎస్‌బీఐ బ్యాంకు వరకు అటు నుంచి తిరిగి కోట లక్ష్మి నరసింహస్వామి దేవాలయం వరకు ఊరేగింపు సాగింది. పురవీధుల్లో జై లక్ష్మీ రసింహస్వామి నామస్మరణ మార్మోగింది.

పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ

పామిడి: పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం రాత్రి డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులపై సీఐ ఎం రాజశేఖర్‌రెడ్డితో సమీక్షించారు. శాంతిభద్రతల విషయంలో రాజీపడొద్దని ఆయన సూచించారు. స్టేషన్‌ను ఆశ్రయించే బాధితులకు న్యాయం చేకూర్చాలన్నారు. అనంతరం ఆయన స్థానిక టీసీ హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

క్లుప్తంగా

తాగునీటి సమస్య పరిష్కారం



పెద్దవడుగూరులో తాగునీటి సరఫరా ప్రారంభిస్తున్న నాయకులు

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని వంక వీధి, గుత్తి రోడ్డు ప్రాంతంలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. వివరాలు..వంక వీధి, గుత్తి రోడ్డు ప్రాంత వాసులు కొన్నేళ్లుగా ఉప్పు నీటినే వినియోగిస్తున్నారు. తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి గ్రామంలో పర్యటించినప్పుడు సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే తాగునీటి సౌకర్యం కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గుత్తిరోడ్డులో మంచినీటి కాలువ వద్దకు వెళ్లే చోటు నుంచి పైపులైన్ ఏర్పాటు చేశారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు వాల్వ్ తిప్పి నీటి సరఫరాను ప్రారంభించారు. తాగునీటి సరఫరాపై ఈసందర్భంగా కాలనీ వాసులు హర్షంవ్యక్తం చేశారు.

జేసీబీ, ట్రాక్టర్ల సీజ్

పెద్దవడుగూరు : దిమ్మగుడి గ్రామం వద్ద పెద్ద వంక నుంచి ఆదివారం అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న జేసీబీ, రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలో ఎవరైనా అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్రీడలతో మానసికోల్లాసం



విజేతలకు ట్రోఫీని అందిస్తున్న మున్సిపల్ కమిషనర్ రవి

తాడిపత్రి అర్బన్: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని, అందుకే ఉద్యోగులకు క్రికెట్ పోటీలను నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ జి.రవి పేర్కొన్నారు. మున్సిపల్ ఉద్యోగులకు ఏటా లాగే ఆదివారం స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో క్రికెట్ పోటీలను నిర్వహించారు. మున్సిపల్ ఉద్యోగులు, ఎమినిటీ సెక్రెటరీలు రెండు జట్లుగా పోటీల్లో పాల్గొన్నారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఎమినిటీ సెక్రెటరీలు 15 ఓవర్లలో 140 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన మున్సిపల్ ఉద్యోగులు 15 ఓవర్లలో కేవలం 90 పరుగులు మాత్రమే చేశారు. విజేతలుగా నిలిచిన ఎమినిటీ సెక్రెటరీల జట్టుకు మున్సిపల్ కమిషనర్ ట్రోఫీని అందజేశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి నేడు భూమిపూజ

గుత్తి రూరల్: మండలంలోని యంగన్నపల్లి గ్రామ శివారు నుంచి బేతాపల్లి వరకూ రూ.63 లక్షలతో నిర్మించే బీటీ రోడ్డు పనులకు సోమవారం ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి భూమిపూజ చేయనున్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత శ్రీనివాస్‌రెడ్డి, మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటల సమయంలో జరిగే కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.


జోరుగా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు



యాడికిలో రిజిస్ట్రేషన్లు చేస్తున్న అధికారులు

యాడికి: మండలంలోని జగనన్న కాలనీల్లో ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మండలంలో జోరుగా సాగుతోంది. ఆదివారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ హనుమాన్ నాయక్, డీటీ బాలమ్మ, ఆర్‌ఐ ఆనందబాబు ఆచారి, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ నాగేశ్వర రెడ్డి రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 219 ఇళ్లకు రిజిస్ట్రేషన్లు చేసినట్లు సబ్ రిజిస్ట్రార్ తెలిపారు. తమకు ఇంటి స్థలం ఇచ్చి రిజిస్ట్రేషన్ ద్వారా సర్వహక్కులు కల్పించడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి



సునీత మృతదేహం

గుంతకల్లు రూరల్: విద్యుత్ షాక్‌కు గురై ఓ వివాహిత మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం ఓబుళాపురం గ్రామానికి చెందిన కురుబ నాగార్జున, సునీత (30) దంపతులకు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆటో డ్రైవర్‌గా నాగార్జున, కూలి పనులతో సునీత కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆదివారం సాయంత్రం స్నానం చేసేందుకు బాత్‌రూమ్‌లోకి వెళ్లిన సునీత లైట్ స్విచ్ ఆన్ చేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై కుప్పకూలింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు.

ముస్లింల అభ్యున్నతే జగనన్న ధ్యేయం





ఎమ్మెల్యే వైవీఆర్, పార్లమెంట్ సమన్వయకర్త శంకరనారాయణను సన్మానిస్తున్న ముస్లింలు, భారీ సంఖ్యలో హాజరైన ముస్లింలు

- ఎమ్మెల్యే వైవీఆర్, పార్లమెంట్ సమన్వయకర్త శంకరనారాయణ
- గుంతకల్లులో ఘనంగా ముస్లింల ఆత్మీయ సమ్మేళనం

గుంతకల్లుటౌన్: ముస్లింల అభ్యున్నతే ధ్యేయంగా జగనన్న పాలన సాగిస్తున్నారని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని పోర్టర్స్‌లైన్ దర్గా ఆవరణలో ముస్లింల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లిలలను గత పాలకులు ఓటు బ్యాంకుగా వాడుకున్నారని విమర్శించారు. సామాజిక, రాజకీయ రంగాల్లో తరతరాలుగా వెనుకబాటుకు గురైన మైనార్టీలకు భద్రత, భరోసా, భవిష్యత్తును అందించిన ఘనత జగనన్నదేనన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో వారి ముఖాల్లో చిరునవ్వులు విరబూయించారన్నారు. గుంతకల్లులో ముస్లింలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.5 కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ఖబరస్తాన్ (శ్మశానవాటిక)కు కేటాయించామన్నారు. పట్టణ శివార్లోని దోనిముక్కల రోడ్డులో ముస్లిం శ్మశానవాటికకు స్థలాన్ని కేటాయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ముస్లిం మతపెద్దల విజ్ఞప్తి మేరకు పట్టణంలోని 80 మంది ఇమామ్, మౌజన్లకు ఇంటిస్థలాలిప్పించడంతో పాటు మదరసా గుర్తింపునకు చర్యలు చేపడతామన్నారు. ముస్లింలు తనను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నందుకు రుణపడి ఉంటానన్నారు. రానున్న రోజుల్లో చరిత్రలో నిలిచిపోయేలా ప్రజలందరి సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామన్నారు. ముస్లింల ఓట్ల కోసం మాయమాటలు చెప్పే విపక్షాల మాటలు నమ్మొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు ఇక్కడికి వచ్చి పోటీచేసినా వైఎస్సార్‌సీపీదే గెలుపన్నారు. మైనార్టీల సంక్షేమానికి ఎల్లప్పుడూ కృషి చేస్తున్న జగనన్న సైన్యానికి మీ ఆశీర్వాదాలు అందించాలని ఎమ్మెల్యే వైవీఆర్ కోరారు.

వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదించండి

వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ అనంతపురం పార్లమెంట్ సమన్వయకర్త శంకరరాయణ ముస్లింలను కోరారు. వైఎస్సార్ ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించి వారి అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. రాజన్న ఆశయాలకు అనుగుణంగానే ఆయన తనయుడు సీఎం జగన్‌మోహన్ రెడ్డి కూడా ముస్లింలకు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తూ వారి జీవనప్రమాణాలను మెరుగుపరిచారన్నారు.

ఓటు బ్యాంకుగానే ముస్లింలు

గత పాలకులు ముస్లింలను ఓటు బ్యాంకుగానే వాడకున్నారని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మైమూన్‌బీ విమర్శించారు. మొదటి సారి ముస్లింలు జగనన్న పాలనలో విద్య, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ప్రగతి సాధిస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇమామ్, మౌజన్లకు గౌరవవేతనమిచ్చిన ఘనత జగనన్నదేనన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవానీ, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, ప్రభుత్వ ఖాజీ సయ్యద్ రజాకపీర్‌సాహెబ్, అదనపు ఖాజీ సత్తార్‌సాబ్, కౌన్సిలర్లు మెహరున్నీసా, అర్షియాబేగం, సుమోబాషా, చాంద్‌బాష, కోఆప్షన్‌సభ్యులు ఫ్లయింగ్‌మాబు, నూర్‌నిజామి, దూదేకుల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ హొన్నూర్‌వలి, వక్ఫ్‌బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడు అహమ్మద్‌బాష, మతపెద్దలు, ముస్లీం మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే వైవీఆర్, శంకర్‌నారాయణలను ముస్లిం మతపెద్దలు, వివిధ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు.

ఖబరస్తాన్‌లో అభివృద్ధి పనులకు భూమిపూజ



ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వైవీఆర్, శంకరనారాయణ



కసాపురంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్, శంకరనారాయణ

గుంతకల్లుటౌన్: ముస్లిం శ్మశానవాటిక(ఖబరస్తాన్)కు జి.కొట్టాల రోడ్డులో కేటాయించిన రెండెకరాల స్థలంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ అనంతపురం పార్లమెంట్ సమన్వయకర్త శంకర్‌నారాయణ భూమిపూజ చేశారు. ఆదివారం ప్రభుత్వ ఖాజీ సయ్యద్ రజాకపీర్ సాహెబ్, అదనపు ఖాజీ సత్తార్‌సాబ్ నిర్వహించిన ఫాతెహా కార్యక్రమంలో వారు ప్రార్థనలు చేశారు. బోరుబావి తవ్వకాలతో పాటు ప్రహరీ నిర్మాణానికి నారికేళాన్ని సమర్పించారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట కోసం ఖబరస్తాన్‌కు రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కేటాయించినందుకు వారు ఎమ్మెల్యే వైవీఆర్, మున్సిపల్ కౌన్సిల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ముస్లింల అభివృద్ధికి పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వైవీఆర్ కృషిని ముస్లిం మతపెద్దలు కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే వైవీఆర్, శంకరనారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, వీసీలు మైమూన్, నైరుతిరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మెహరున్నీసా, అర్షియాబేగం, సుమోబాషా, చాంద్‌బాష, కోఆప్షన్‌సభ్యులు ఫ్లయింగ్‌మాబు, నూర్‌నిజామి, వక్ఫ్‌బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడు అహమ్మద్‌బాషా, వైఎస్సార్‌సీపీ మైనార్టీ జేఏసీ నాయకులు జమీల్, ఖలీల్, చాంద్‌పీరా, మౌలా, ఆర్‌డీజీ.బాషా, గఫార్‌ఖాన్,నూర్, షాబుద్దీన్, జిలాన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

గుంతకల్లు రూరల్: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ సమన్వయకర్త శంకరనారాయణ పేర్కొన్నారు. ఆదివారం కసాపురంలో రూ.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఉదయాన్నే కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానానికి చేరుకున్న వారికి ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు వారికి స్వామివారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు. అనంతరం స్థానిక నాయకులు, శంకరనారాయణతో కలిసి ఎమ్మెల్యే శిలాఫలకాన్ని ఆవిష్కరించి నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ బీవీ మాధవి, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్వీఆర్ మోహన్, సర్పంచ్ రాయల్ అనిత, ఎంపీటీసీ జ్యోతి, మాజీ సర్పంచ్ తిక్కస్వామి, కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి సోమిరెడ్డి, స్థానిక నాయకులు బెస్త మనోహర్, వెంకటరెడ్డి, గుంతుల రామాంజనేయులు, వినోద్ కుమార్‌రెడ్డి, వంశీ యాదవ్, వెంకటరాముడు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు





తీవ్రంగా గాయపడిన రఫీ, రవి

గుత్తి రూరల్: మండలంలోని వన్నేదొడ్డి గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. పామిడికి చెందిన రఫీ, నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన రవి పని నిమిత్తం బైక్‌పై ప్యాపిలికి బయలుదేరారు. అయితే వన్నేదొడ్డి శివారులోని క్రాస్ వద్ద వేగంగా వెళ్తున్న వారి ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రఫీ, రవిని 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో రవి ఛాతీ వద్ద రంధ్రం పడగా రఫీ మొహం, కాళ్లకు తీవ్ర గాయాలై పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు ఇద్దరిని అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ప్రభుత్వ భవనాల ప్రారంభం

బుక్కరాయసముద్రం: బొమ్మలాటపల్లిలో సోమవారం ఉదయం 8 గంటలకు సచివాలయం, ఆర్బీకే, డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభించనున్నట్లు వైఎస్సార్ మండల కన్వీనర్ అంకే నరేష్ ఆదివారం తెలిపారు. అనంతరం ఉదయం 8.30 గంటలకు కొర్రపాడు సమీపంలో రూ.3 కోట్లతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు హాజరవుతారన్నారు.

టెక్నాలజీపై అవగాహన అవసరం



ముగింపు సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

బుక్కరాయసముద్రం: విద్యార్థులకు టెక్నాలజీపై అవగాహన అవసరని హైదరాబాద్‌కు చెందిన సీడీఏసీ జగదీష్‌బాబు పేర్కొన్నారు. రోటరీపురంలోని ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీఎస్టీసీ వారు కళాశాల అనుబంధంగా క్యాటిలైజ్డ్ అండ్ సపోర్టెడ్ బై దినేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ, కమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(గవర్నమెంట్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో విద్యార్థులకు 3 రోజుల పాటు సైబర్ సెక్యూరిటీపై జరిగిన అవగాహన సదస్సు ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి సీడీఏసీ హైదరాబాద్ ప్రాజెక్ట్ మేనేజర్ జగదీష్, సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ రామకృష్ణయ్య హాజరై మాట్లాడారు. విద్యార్థులు కంప్యూటర్, ఫోన్ వాడేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. టెక్నాలజీ వినియోగంలో మంచితో పాటు చెడు ఉందన్నారు. ప్రధానంగా సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పర్సనల్ ఇన్ఫర్మేషన్, బ్యాంక్ డిజిటల్ లావాదేవీలను సురక్షితంగా ఎలా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వెంకట నాగజయుడు, కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ హేమంత్ కుమార్ యాదవ్, కళాశాల అధాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు 'స్పందన'

యల్లనూరు: తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఇన్‌చార్జ్ తహసీల్దారు శ్వేత తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఇవ్వాలని సూచించారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

యల్లనూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను కల్పించాలని పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం మేడికుర్తి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రంలో తాగునీరు, కరెంటు, దివ్యాంగ ఓటర్లకు ర్యాంపులు ఉన్నాయా లేదా పరిశీలించామన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సంపత్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

గార్లదిన్నె: మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై తరిమెల క్రాస్ వద్ద ఆదివారం ఐచర్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సీఎస్‌డీటీ హరిప్రియ తెలిపారు. 11 క్వింటాళ్ల సబ్సిడీ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని రాప్తాడు స్టాక్ పాయింట్‌కు తరలించారు. వాహనాన్ని సీజ్ చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ సాయిప్రసాద్, ఏఈఈ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

సెబ్ అధికారుల బదిలీ

తాడిపత్రి అర్బన్: తాడిపత్రి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు బదిలీ అయ్యారు. ఎన్నికల నేపథ్యంలో ఇక్కడి సెబ్ సీఐ విజయ్‌కుమార్ నంద్యాలకు బదిలీ కాగా కర్నూలు నుంచి కేవీఎస్ ఫణికుమార్ ఇక్కడికి వచ్చారు. తాడిపత్రి సెబ్ ఎస్‌ఐగా కళ్యాణ్‌కుమార్ నియమితులయ్యారు.

సికింద్రాబాద్‌కు వెళ్లి పింఛన్ పంపిణీ



పింఛన్ అందిస్తున్న వలంటీర్ రాజేష్

గుత్తి రూరల్: మండలంలోని బేతాపల్లి గ్రామ వలంటీర్ రాజేష్ ఆదివారం తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్‌కు వెళ్లి పింఛన్ పంపిణీ చేశాడు. వివరాలిలా ఉన్నాయి.. బేతాపల్లి గ్రామానికి ఆనంద్ అనే దివ్యాంగుడు పని నిమిత్తం సికింద్రాబాద్‌కు వెళ్లి నెల రోజుల నుంచి అక్కడే ఉండిపోయాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ రాజేష్ పల్నాడు జిల్లాలోని నాదెండ్ల గ్రామంలో ఉన్న ముగ్గురికి పింఛన్‌ల పంపిణీ పూర్తి చేసి అక్కడి నుంచి నేరుగా సొంత ఖర్చుతో ఆదివారం సికింద్రాబాద్‌కు వెళ్లి ఆనంద్‌తో వేలిముద్ర తీసుకొని పింఛన్‌ను అందజేశాడు. గ్రామానికి చెందిన పింఛన్ దారులు వేర్వేరు చోట్ల ఉన్నప్పటికీ వ్యయప్రయాసలతో అక్కడకు వెళ్లి పింఛన్ అందజేసిన వలంటీర్‌ను గ్రామస్తులు అభినందించారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి

పుట్లూరు: మండలంలోని కూలీలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ చెన్నకేశవులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని గ్రామాల్లో పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పనుల కోసం సంబంధిత ఉపాధి హామీ సిబ్బంది వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు సమన్వయకర్త పర్యటన

శింగనమల: మండలంలోని లోలూరు, ఆకులేడు, వెస్ట్ నరసాపురం, నాయనవారిపల్లి, రాచేపల్లి, నిదనవాడ, తరిమెల, కల్లుమడి, గుమ్మేపల్లిలో సోమవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డిలు పర్యటించనున్నారు. ఈమేరకు డీసీఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

సృష్టి పతనానికి కారకుడు మానవుడు

పామిడి: స్థానిక సీఎస్ఐ చర్చిలో నూతన సంవత్సర రెండో నెల ప్రథమ ఆదివార ఆరాధనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ మాట్లాడుతూ దేవుడు సృజించిన సృష్టిపై మానవునికి సర్వాధికారం ఇచ్చాడన్నారు. అలాంటిది సృష్టిని సంరక్షించాల్సిన మానవుడు దేవునికి విరోధమైన పనులతో సృష్టి వినాశనానికి పాల్పడుతున్నాడన్నారు. తద్వారా సృష్టిపతనంతో మానవుడు తన మనుగడకే ముప్పు కొని తెచ్చుకుంటున్నాడన్నారు. చర్చి సెక్రటరీ పరదేశి విజయశేఖర్‌రాజు, సభ్యులు పాల్గొన్నారు.

మెగా కంటి వైద్య శిబిరం

పామిడి: స్థానిక షాదీఖానాలో ఆదివారం పామిడి లయన్స్‌క్లబ్, బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి మెగా వైద్య శిబిరం జరిగింది. కంటి వైద్య నిపుణురాలు ఇలాంగో 250 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 110 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. ఇస్కాన్ టెంపుల్ అధినేత దామోదర్ ప్రభు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. పామిడి లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయూష్ సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతి నాయుడు, అధ్యక్షురాలు డాక్టర్ శాంతిప్రియ, జిల్లా చైర్‌పర్సన్ డాక్టర్ మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు పీసే జయరాంరావు, సౌత్ ఇండియా కార్యదర్శి ఆవుల ప్రసాద్, డైరెక్టర్లు రోషన్ జమీర్, పీసే కిరణ్, పీసే సుహాస్, గంగశేఖర్, ఆసుపత్రి ఆర్గనైజర్ శివకుమార్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికల విడుదల

బుక్కరాయసముద్రం: దేవరకొండపై ఈ నెల 17 నుంచి జరగబోయే కొండమీద రాయుని బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను సర్పంచ్ పార్వతి ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ ఈఓ రమేష్ బాబు మాట్లాడుతూ మండల కేంద్రంలో కొండమీద రాయుని బ్రహ్మోత్సవాలు ఈ నెల 17 నుంచి 26వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా 24న కొండమీ రాయుని కల్యాణోత్సవం. తిరునాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అర్చకులు లక్ష్మణాచార్యులు, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.